## పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన డీఓ ప్రసాదరావు

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చ్ 14**: సీలేరు లోని బాలుర గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని డీఓ ప్రసాదరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, గూడెం కొత్త వీధి మండలం పరిధిలోని సీలేరు గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పదోతరగతి పరీక్షా కేంద్రంలో ధారకొండ, సీలేరు డీఏవీ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల ఆశ్రమ పాఠశాల, గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు.మొత్తం ఐదు పాఠశాలలకు చెందిన 197 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా, కంపార్ట్మెంట్ విద్యార్థులతో కలిపి సుమారు 240 మంది వరకు ఈ కేంద్రంలో పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. వీరి కోసం గదికి 24 మంది చొప్పున 10 పరీక్షా గదులను ఏర్పాటు



చేసినట్లు వెల్లడించారు.పరీక్షల నిర్వహణలో భాగంగా ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు శిక్షణ కూడా అందించినట్లు తెలిపారు. పరీక్షల సమయంలో ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా శాఖాధికారుల పర్యవేక్షణతో పాటు సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేసినట్లు డీఓ ప్రసాదరావు పేర్కొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# అరణ్యమే వేదిక... గిరిజనమే అతిథులు....








- పాడేరు నియోజక వర్గంలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం
- మారుమూల గిరిజన గ్రామం ఓనూరులో పార్టీ పతాకం ఆవిష్కరించిన ఉప ముఖ్యమంత్రివర్యులు,
- రోడ్లు, తాగునీటి పథకాలు పరిశీలన
- ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్న పవన్ కళ్యాణ్

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్, మార్చి 14**:జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈసారి వినూత్నంగా గిరిజన గ్రామాల్లో నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పాడేరు నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో పర్యటిస్తూ పార్టీ ఆవిర్భావ వేడుకలను గిరిజనుల మధ్య జరుపుకున్నారు. పెద్ద వేదికలు, హోర్డింగులు, డీజేలు లేకుండా ప్రకృతి ఒడిలో ప్రజల మధ్య పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించడం ప్రత్యేకతగా నిలిచింది.అల్లూరి సీతారామ రాజు జిల్లా పరిధిలోని పాడేరు నియోజకవర్గంలోని ఓనూరు, నందిగరువు తదితర గిరిజన గ్రామాలు ఈ వేడుకలకు వేదికలయ్యాయి. ఓనూరు కూడలిలో నిర్మించిన నూతన జెండా స్థూపాన్ని ఆవిష్కరించిన పవన్ కళ్యాణ్ పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఓనూరు జంక్షన్ నుంచి నందిగరువు వరకు పీఎం జన్మన్ పథకం కింద నిర్మించిన 2.4 కిలోమీటర్ల బీటీ రహదారిని కాలినడకన పరిశీలించారు. రూ.1.70 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ రహదారి పనితీరును పరిశీలించి అధికారులను అభినందించారు. కొండలను తొలచి, మార్గమధ్యంలోని బండలను తొలగించి నాణ్యతతో రోడ్డు నిర్మించినట్లు అధికారులు వివరించారు. రహదారి నిర్మాణంలో భాగంగా ఎనిమిది కల్వర్టులు నిర్మించాల్సి వచ్చిందని తెలిపారు.ఈ సందర్భంగా గిరిజన చిన్నారులతో కలిసి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకు ధన్యవాదాలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు.ఓనూరు గ్రామ పంచాయతీలో జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన తాగునీటి పథకాన్ని పరిశీలించారు. రూ.8.30 లక్షల వ్యయంతో 60 ఇళ్లకు పైప్ కనెక్షన్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కుళాయిల వద్ద బిందెలో నీటిని పట్టి స్వచ్ఛతను స్వయంగా పరిశీలించిన పవన్ కళ్యాణ్, గ్రామస్తులను నీటి సరఫరాపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.అంగన్వాడీ, పాఠశాల సందర్శనఓనూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, మండల ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. చిన్నారులకు స్వీట్లు, పౌష్టికాహార కిట్లు అందజేశారు. గర్భిణులకు, అంగన్వాడీ సిబ్బందికి నూతన వస్త్రాలు బహూకరించారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, ఇతర స్టేషనరీతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. పాఠశాల భవనంలోని దెబ్బతిన్న ఫ్లోరింగ్‌ను తక్షణం మరమ్మతు చేయాలని అధికారులకు ఆదేశించారు.ఓనూరు నందిగరువు మార్గంలో ఉన్న కొత్తపాలెం గ్రామస్తులు తమ గ్రామానికి రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరగా సంబంధిత అధికారులను పిలిచి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామానికి తాగునీటి సౌకర్యం కోసం ఇప్పటికే రూ.6.90 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి కూడా ఆమోదం ప్రకటించారు.గిరిజన గ్రామాల అభివృద్ధికి రోడ్ల పక్కన పనస, సీతాఫలం వంటి పండ్ల చెట్లు నాటాలని సూచించారు. కొండవాలు ప్రాంతాల్లో బాంబో కాటేజీలు ఏర్పాటు చేసి ఎకో టూరిజం అభివృద్ధి చేయాలని, హోమ్ స్టేలు, ఫిల్మ్ షూటింగ్ స్పాట్లుగా గ్రామాల అందాలను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గిరిజన యువతకు ప్రైవేట్ సెక్యూరిటీ రంగంలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. నందిగరువు గ్రామ ఆడపడుచుల కోరిక మేరకు వారితో కలిసి కాలినడకన గ్రామం వరకు నడిచారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ఇక పాడేరు సమీపంలోని వర్ధనపల్లి గ్రామంలో అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి హామీ ఇచ్చారు.

ఈ పర్యటనలో రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. పర్యటన అనంతరం పవన్ కళ్యాణ్ పాడేరు సమీపంలోని శ్రీ లలిత త్రిపుర సుందరి దేవాలయంను దర్శించుకున్నారు.గిరిజన సంప్రదాయాలతో స్వాగతం పలికిన స్థానికులు పసుపు అక్షతలతో ఆయనకు ఆశీర్వాదాలు అందించారు.జీవో నెంబర్ 3 పునరుద్ధరణపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర జానపద కళలు సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ వంపూరి గంగులయ్య, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ శ్రీ కళ్యాణం శివ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ,కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ అమిత్ బర్దార్, పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ బాలు నాయక్, ఐ.టి.డి.ఎ. పీవో శ్రీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు రహదారి కనెక్టివిటీపై ప్రభుత్వ దృష్టి



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 14**:వి ఎం ఆర్ డి ఎ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేపడుతున్న కీలక రహదారి నిర్మాణ పనులను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి . నారాయణ శనివారం సాయంత్రం పరిశీలిం చారు.వి ఎం ఆర్ డి ఎ ఛైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ జీవిఎంసి కమిషనర్ కేతన్కర్ లతో కలిసి మంత్రి పలు ప్రాంతాల్లో జరుగుతున్న రహదారి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. నేరెళ్లవలస,కొత్తవలస,బోయపాలెం,కాపులుప్పాడ, భీమిలిదొరతోట జంక్షన్‌లను అను సంధానించే రహదారుల నిర్మాణాలను పరిశీ లిస్తూ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.రహదారి నిర్మాణంలో ఎదు రవుతున్న సమస్యలు, ప్రస్తుత పనుల స్థితి, పూర్తి చేసే గడువు వంటి అంశాలపై మంత్రి అధికారులతో చర్చించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ రహదా రులు పూర్తయితే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సులభంగా చేరుకునే సౌక ర్యం కలుగుతుందని అధికారులు వివరించారు. విమానాశ్రయం కార్యకలాపాలు ప్రారంభమయ్యే సమయానికి రహదారి నిర్మాణ పనులు పూర్త య్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.ఈ సందర్భంగా వి ఎం ఆర్ డి ఎ ఛైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయు డు సూచనల మేరకు రహదారి నిర్మాణ పనుల ను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. నిర్ణీత గడువులోనే పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో వి ఎం ఆర్ డి ఎ ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్‌తో పాటు ఇంజనీరింగ్, ప్లానింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఉత్తర నియోజకవర్గం 51వ వార్డులో అభివృద్ధి పనులకు నిధుల మంజూరు




**విశాఖ ఉత్తర మార్చి 14(పెన్ పవర్)**ఉత్తర నియోజకవర్గంలోని 51వ వార్డులో అభివృద్ధి పనులకు సుమారు 76 లక్షల 95 వేల రూపాయలు మంజూరు చేశారు. మహత్ కాలనీ, గాంధీనగర్2, కళింగ నగర్, ఏకలవ్య కాలనీలలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఈ నిధులను కేటాయించినట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా గాంధీనగర్2 కాలనీలో అభివృద్ధి పనులకు సంబంధించిన ఫ్లెక్సీని ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్ రాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా వార్డును మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్ రాజు కూడా వార్డు అభివృద్ధికి ఎల్లప్పుడూ తన సహకారం అందిస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జోన్5 జోనల్ కమిషనర్ రాము, ఏఈ సాయినాథ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుడుమూరు తిరుమల రావు, కింతల వరహాల రాజు, కూటమి నాయకులు, గాంధీనగర్2 కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా గరుడాద్రి వెంకటేశ్వర బ్రహ్మోత్సవాలు





**గాజువాక: పెన్ పవర్ ,మార్చి 14** జీవీఎంసీ 65వ వార్డు బానోజీ తోట వంబే కాలనీ గరుడాద్రి కొండపై వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గత మూడు రోజులుగా అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు ఆలయ ధర్మకర్త మంజుల, ఆలయ చైర్మన్ దొడ్డి రమణ ఆధ్వర్యంలో అంగరంగ వైభవముగా నిర్వహించారు. వేద పండితులుశ్రీమాన్ బాలాజీ బట్టాచార్య స్వామి శ్రీరంగం , మాధవాచార్యులు, రమణ దీక్షితులు వారిచే అత్యంత వైభవంగా నిర్వహించారు. కుంభ మండలము, బింబ పూజ, అష్టాక్షర యోగం, శ్రీలక్ష్మి నారాయణ అర్చన, జపము, పారాయణం, యజ్ఞం, పూర్ణాహుతి,చక్రస్నానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా వైఎస్ఆర్సిపి నాయకులు తిప్పల దేవన్ రెడ్డి ఏమిలి జ్వాల దంపతులు, ఉరుకుటి చందు, దుర్లభ కృష్ణ ప్రేమ దాస్ హరే కృష్ణ గోకుల మందిరం హాజరయ్యారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణం కొరకు ఎనిమిది సంవత్సరాలు ఆలయ కమిటీ వారు అహర్నిశలు కృషిచేసి విగ్రహ ప్రతిష్ట ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవం జరిపించడం భక్తులు పుణ్యం అని అలాగే ప్రాంతాలు సుఖశాంతులతో ఉండాలని భగవంతుని కోరుదామని అన్నారు. ఉత్తర ఆంధ్రాలో వెలసిన రెండవ ఆలయం అని అన్నారు. ప్రతి శనివారం లాభాల దుర్గాప్రసాద్ భవాని వారి బృందమచే అన్నమాచార్య కీర్తన ఆ లోపల జరిగింది.ఈ కార్యక్రమంలో పెంటకోట నాగేశ్వరరావు, విజయ నాయక్,పూడి శాంతి, తిప్పల స్వాతి, పప్పల ఆదిలక్ష్మి, కె.జానకి,పెంటకోట రాజు ,బి. వెంకటేష్, రుక్మంతరావు మరియు ఆలయ సేవకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వార్డ్ లో జాతీయ డెంగ్యూ మాసోత్సవాలు




**గాజువాక :పెన్ పవర్ ,మార్చి 14** జాతీయ డెంగ్యూమాసోత్సవాలు కార్యక్రమం లో భాగంగా ప్రజలకు అవగాహన కలిపించారు . ఇంటింటికి వెళ్లి,నిలవ ఉన్న కుండీల్లో నీళ్లు, మనం తాగిన కొబ్బరి బొండాలు, ఫిష్ అక్వేరియములు, ఇంటిముందు మురుకు కాలువలు, పరిశీలించి, పిల్లల ఆరోగ్యం పట్ల, మన ప్రాంతాలు పరిశుభ్రత పట్ల జాగ్రత్త తీసుకోవాలంటూ, మలేరియా డిపార్ట్మెంట్ వారితో గడపగడపకు వెళ్ళి వివరించారు , ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గోమాడ వాసు, జిల్లా టీఎన్ఎస్ నాయకులు, రతన్ కాంత్, 66వ వార్డు సీనియర్ తెలుగుదేశం నాయకులు వార్డు ట్రెజరర్, లక్కోజి లక్ష్మణరావు, హరీష్, పాల్గొని ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు . ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలంటూ ప్రతి ఒక్కరికి తెలియపరుస్తూ మలేరియా మీద జాగ్రత్తగా ఉండండి, ఆరోగ్యం పట్ల ఏమైనా ఉంటే వెంటనే తెలియపరచడానికి డిపార్ట్మెంట్ వారు అలాగే హాస్పటల్ కూడా అందుబాటులో ఉన్నాయని అన్నారు .

## విజ్ఞాన్ దువ్వాడలో కమ్యూనికేషన్ అండ్ ఇంటర్వ్యూ మాస్టరీపై నిపుణుల ఉపన్యాసం





**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,మార్చి 14 :**దువ్వాడలోని విజ్ఞాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆటోనమస్లోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలు మరియు ఇంటర్వ్యూ సిద్ధతను మెరుగుపరచడానికి కమ్యూనికేషన్ అండ్ ఇంటర్వ్యూ మాస్టరీ అనే అంశంపై నిపుణుల ఉపన్యాసం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా డీఆర్ మాస్టర్ ట్రైనర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి దక్షయణి ఎన్, అలాగే అదే సంస్థకు చెందిన శ్రీ రవి కుమార్ వెంకట పాల్గొన్నారు. వారు విద్యార్థులకు సమర్థవంతమైన కమ్యూనికేషన్ పద్ధతులు, ఆత్మవిశ్వాసం పెంపు, రిజ్యూమ్ ప్రెజెంటేషన్ మరియు ఉద్యోగ ఇంటర్వ్యూలను విజయవంతంగా ఎదుర్కొనే విధానాలపై విలువైన సూచనలు అందించారు.

ఈ సందర్భంగా వక్తలు స్పష్టమైన సంభాషణ, బాడీ లాంగ్వేజ్ మరియు ప్రొఫెషనల్ ఎటికెట్ ఉద్యోగ అవకాశాలను పొందడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. అదేవిధంగా సాధారణంగా అడిగే ఇంటర్వ్యూ ప్రశ్నలకు ఎలా సమాధానం ఇవ్వాలి, సానుకూల దృక్పథాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలి మరియు రిక్రూటర్ల ముందు తమ నైపుణ్యాలను సమర్థంగా ఎలా ప్రదర్శించాలి అనే విషయాలపై మార్గనిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమం పరస్పర చర్చలతో సాగి విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ ఉపన్యాసం ద్వారా విద్యార్థులు క్యాంపస్ ప్లేస్మెంట్లు మరియు భవిష్యత్ వృత్తి జీవితానికి ఉపయోగపడే ప్రాయోగిక సూచనలు పొందారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. సుధాకర్, రెక్టర్ డాక్టర్ వి. మధుసూదనరావు, మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ జి. నీలిమ ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ విద్యార్థుల భవిష్యత్ విజయాలకు కమ్యూనికేషన్ నైపుణ్యాలు మరియు ఇంటర్వ్యూ సిద్ధత ఎంతో అవసరమని పేర్కొన్నారు.

## మంచినీటి దాహం తీర్చిన సర్పంచ్



**హుకుంపేట పెన్ పవర్ మార్చి 14:**అల్లూరి సీత రామరాజు జిల్లా హుకుంపేట మండలం హుకుంపేట పంచాయతీ దిగుడుపుట్టు గ్రామం లో పంచాయతీ 15 వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా దాదాపు 3.50 (మూడు లక్షలు ఏబై వేల రూపాయలు) తో మంచినీరు కొరకు ఈరోజు శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమం సర్పంచ్ వెంకట పూర్ణిమ, మరియు ఎంపీటీసీ కొమ్మ రమ చేతులు మీదుగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పూర్ణిమ మాట్లాడుతూ ప్రస్తుతం దిగుడు పుట్టు గ్రామం లో ఊట నుండి వచ్చే నీళ్లను సోలార్ ద్వారా ప్రస్తుతం అందిస్తున్నాం అని అన్నారు అయితే ,సోలార్ అవ్వడం వలన వర్షా కాలంలో మంచినీటికి తీవ్ర ఇబ్బందిలకు గురి అవుతున్నాం అని దిగుడుపుట్టు గ్రామస్తులు సర్పంచ్ పూర్ణిమ కు తెలియజేయగా ఆమె వెంటనే స్పందించి గ్రామస్తులు ఇబ్బంది పడకూడదు అనే స్వఉద్దేశ్యం తో బోర్ ద్వారా మోటార్, ట్యాంక్ వేసి మంచినీటి పైపుల ద్వారా మంచి నీరు సదుపాయం కల్పిస్తున్నారని ఆమె తెలిపారు.స్పందించి వెంటనే మంచినీరు సదుపాయం కల్పిస్తున్నందుకు దిగుడుపుట్టు గ్రామస్తులు సర్పంచ్ పూర్ణిమ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ సమిడ.వెంకటాపూర్ణిమ, ఎంపీటీసీ కొమ్మ రమ, హుకుంపేట మండలం వైస్సార్సీపీ మండల్ అధ్యక్షులు అనిల్, వైస్సార్సీపీ నాయకులు గడ్డంగి సూరిబాబు, వండాలి నాగేష్, వల్లంగి రాజారావు,అప్పన్న మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## చింతపల్లి మార్కెట్ యార్డులో మెగా ఉచిత పశువుల వైద్య శిబిరం.

- మార్కెట్ కమిటీ చైర్పర్సన్ కిలో ఊర్మిళ. కార్యదర్శి సమ్మిరెడ్డి జగ్గన్న.



**చింతపల్లి పెన్ పవర్ మార్చి 14.**చింతపల్లి మండలం చౌడుపల్లి గ్రామంలో ఈ నెల 16న (సోమవారం). మెగా ఉచిత పశువుల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మార్కెట్ కమిటీ ఎయిర్ పర్సన్ కిలో ఊర్మిళ, సెక్రటరీ ఎస్ జగ్గన్న ఒక ప్రకటనలో తెలిపారు. మెగా ఉచిత పశువుల వైద్య శిబిరం ఉదయం 7 గంటల నుండి స్థానిక మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చింతపల్లి ఆర్థిక సహాయంతో జరిగే ఈ కార్యక్రమంలో వైద్య శిబిరం డిపార్ట్మెంట్ వైద్యులు పాడి పశువులు, ఆవులు, మేకలు, గొర్రెలు, కోళు వంటి వాటిని పరీక్షించి అవసరమైన మందులు ఇంజక్షన్లు ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని చింతపల్లి చౌడుపల్లి పరిసర ప్రాంతాల రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కిలో ఊర్మిళ కార్యదర్శి సమ్మిరెడ్డి జగ్గన్న కోరారు.

## పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం పలికిన గొర్లె వీరవెంకట్



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 14:**అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు మండలం వంట్లమామిడి పంచాయతీ పరిధిలోని నంది గురువు గ్రామానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ శనివారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.అరకు పార్లమెంట్ పరిధికి చెందిన జనసేన పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీరవెంకట్ హెలిప్యాడ్ వద్ద పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను చూసేందుకు ఆసక్తి చూపారు. కార్యక్రమం సందర్భంగా జనసేన పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా నినాదాలు చేశారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టా మంజూరు చేయాలి



**పెన్ పవర్ సాలూరు మార్చి 14:** పాచిపెంట మండలం మోదుగ పంచాయితీ పరిధిలో ఉన్న గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు కోరారు. బుర్ర మామిడి , బంగార గుడ్డి కాట్రగడ్డ, బొడ్డపాడు గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు లేనందున ఇబ్బందులకు గురి అవుతున్నారని దీంతో ప్రభుత్వ పథకాలు గిరిజన రైతులకు అందడం లేదని తెలిపారు. గిరిజనులు సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారని అన్నారు. గ్రీన్ ఫీల్డ్ సిక్స్ లైన్ రహదారి నిర్మాణం చేయడం వలన రైతులు భూములు కోల్పోయారని వారికి నష్టపరహారం వెంటనే అందజేయాలని డిమాండ్ చేసారు. అటవీ హక్కులు చట్టం ద్వారా గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు, అటవీ భూములకు పట్టాలు మంజూరు చేయాలని, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పందించి న్యాయం చేయాలని కోరారు.

## డాక్టర్ కందుల ఆధ్వర్యంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



- ఘనంగా వేడుకల నిర్వహణ
- జన సైనికులు, వీర మహిళల సమక్షంలో కేక్ కటింగ్
- సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ

**విశాఖ దక్షిణ మార్చ్ 14(పెన్ పవర్)**విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, 32 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

అల్లిపురం నేరెళ్ల కోనేరు లో గల తన పార్టీ కార్యాలయంలో జనసైనికులు, వీర మహిళ సమక్షంలో కేక్ కట్ చేసి ఈ వేడుకలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు.

నవ వధువులు కె.రాణి, ఎం.ప్రియలకు పట్టు బట్టలు, కుంకుమ వెండి భరిణిలు అందజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం ప్రతి ఏటా మార్చి 14న ఘనంగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్థాపించిన ఈ పార్టీ తన 13వ ఆవిర్భావ వేడుకలను ఎండల తీవ్రత దృష్ట్యా రాష్ట్రస్థాయి సభ రద్దు చేసి, గిరిజన ప్రాంతాల్లో (నందిగరువు, పాడేరు) సాదాసీదాగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

మార్చి 14, 2014న పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించారని వెల్లడించారు."ప్రజల కష్టాల కోసం, ప్రశ్నించే తత్వం కోసం" పార్టీ స్థాపన జరిగిందన్నారు. 2014లో పార్టీని స్థాపించినా, 2019లో మొదటిసారిగా ఎన్నికల్లో పోటీ చేయడం జరిగిందన్నారు.

2024 ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమిగా ఏర్పడి, గొప్ప విజయాన్ని సాధించి అధికారంలోకి రావడం జరిగిందన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలపై పవన్ కళ్యాణ్ దృష్టి సారించారని, రాష్ట్ర అభివృద్ధి కోసం జనసేన పార్టీ అవిశ్రాంతంగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కె.నళిని దేవి,వాసవి క్లబ్ పాస్ట్ గవర్నర్ కె.కీర్తన,కె.కృష్ణ, అంథోని శేఖర్, కె.అప్పారావు, వై.శీను, కందుల కేదార్నాథ్, కందుల బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం

- జిల్లాలో మొత్తం 133 కేంద్రాల్లో పరీక్ష రాయును న్న 28,983 మంది విద్యార్థులు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 14 :** పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్ తెలి పారు. శనివారం ఉదయం విద్యాశాఖ అధికారి కార్యాలయం లో ఏర్పాటు చేసిన పత్రికా సమా వేశంలో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పరీక్షలు సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షలు మార్చి 16, 2026 నుండి ప్రారంభమై ఏప్రిల్ 01, 2026 వరకు జరుగుతాయని, ప్రతిరోజూ ఉద యం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు నిర్వహించబడతాయని, పి ఎస్ మరియు ఎన్ ఎస్ మార్చి 25 మరియు 28 తేదీలలో పరీక్షలు మాత్రం ఉదయం 9:30 నుండి 11:30 వరకు మాత్రమే జరుగుతాయని తెలిపారు. విద్యార్థులను ఉదయం 9:00 గంటల నుండి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి స్తారని, ఉదయం 10:00 గంటల తర్వాత వచ్చే విద్యా ర్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ లోపలికి అనుమ తించబోమని స్పష్టం చేశారు.మన జిల్లాలో 456 పాఠశాలల నుండి 15,292 మంది బాలురు, 13,691 మంది బాలికలు వెరసి మొత్తం 28,9 83 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతు న్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 133 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి కేంద్రంలో ఒక చీఫ్ సూపరింటెండెంట్ మరియు ఒక డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను నియమించా మన్నారు. మొత్తం 1,634 మంది ఇన్విజిలేట ర్లను నియమించగా, వీరిలో 20% మంది ప్రైవే ట్ పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు. సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన 8 కేంద్రాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చే యడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం పరీక్ష లకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయా ణించే సదుపాయం కల్పించారని తెలియజేశా రు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను నేరుగా వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర యాప్ ద్వారా గానీ, ‘లీప్‘ యాప్ ద్వారా తమ పెన్ నంబర్ ఉపయోగించి ఆన్‌లైన్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిపై ఎటువంటి అధికారుల సంతకం అవసరం లేదన్నారు. పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరు, విద్యుత్ మరియు ఫర్నిచర్ వంటి కనీస సౌకర్యాలను సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు మరియు హెల్త్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది అందుబా టులో ఉంటారన్నారు.జిల్లాలో ప్రత్యేక అవస రాలు గల విద్యార్థుల కోసం 260 మంది స్క్రైబ్స్ అందుబాటులో ఉంచడం జరిగింది అన్నారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని శాఖల సమన్వ యంతో పరీక్షలను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి స్వాగతం పలికిన జనసేన నాయకుడు వాడకాని వినయ్.



**పెన్ పవర్, మార్చి 14** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు పర్యటనలో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు జనసేన నాయకుడు వాడకాని వినయ్ ఘన స్వాగతం పలికారు. అల్లూరి జిల్లాలో అడవి తల్లి బాట కార్యక్రమంలో భాగంగా పాడేరు మండలం , వంట్లమామిడి పంచాయతీ,నందిగరువు గ్రామానికి వచ్చిన డిప్యూటీ సీఎం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కి హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం స్వచ్ఛమైన, కల్మషం లేని మనసు కలిగిన గిరిజనులు మధ్య జరుపుకోవాలని సంకల్పించిన పవన్ కళ్యాణ్ పాడేరులో ఏ హంగు ఆర్భాటం లేకుండా కార్యక్రమాన్ని గిరి పుత్రుల మధ్య జరపడం ఆనందకరమైన విషయమని వినయ్ తెలిపారు. జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేనలోకి డీసీసీ మాజీ అధ్యక్షుడు వంతల సుబ్బారావు

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో చేరిక



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,మార్చి 14:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, డీసీసీ మాజీ అధ్యక్షుడు వంతల సుబ్బారావు జనసేన పార్టీలో చేరారు. పాడేరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆయన శనివారం జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.చింతపల్లి మండలానికి చెందిన సుబ్బారావు,చింతపల్లి మాజీ ఎంపీపీ వంతల బాబూరావు, మాజీ డీసీసీబీ డైరెక్టర్లు పాడేరు నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీలో చేరినట్లు తెలిసింది. ఇంకా అనేకమంది శ్రేయోభిలాషులు పలుకార్యకర్తలు కూడా జనసేనలో చేరనున్నట్లు విశ్వాసనీయ సమాచారం. పాడేరు నియోజకవర్గంలోని చౌడుపల్లి పంచాయతీ వామగెడ్డ, చీకటి మామిడివీధికి చెందిన వంతల సుబ్బారావు 1989 నుంచి కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తగా పనిచేస్తున్నారు. 2005లో చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సేవలందించారు. అనంతరం 2006 నుంచి 2016 వరకు పీసీసీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు.2019లో పాడేరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం 2019 నుంచి 2024 వరకు డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల పాడేరు కాంగ్రెస్ అభ్యర్థిగా సుబ్బారావును ప్రకటించినప్పటికీ, తరువాత జరిగిన పరిణామాలతో మాజీ ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబును పార్టీ అభ్యర్థిగా నిలబెట్టింది.దీంతో సుబ్బారావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 15,935 ఓట్లు సాధించి నియోజకవర్గంలో తృతీయ స్థానంలో నిలిచారు. ప్రస్తుతం తన అనుచరులతో కలిసి జనసేనలో చేరడం ద్వారా రాజకీయంగా కొత్త అధ్యాయం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.సుబ్బారావు పీవీటీజీ వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో సామాజికంగా కూడా ఆయనకు మంచి ఆదరణ ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

# పంజా జంక్షన్ బీచ్ రోడ్డు దుస్థితి



- సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా
- వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 14 :**పంజా జంక్షన్ నుంచి బీచ్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు అనేక సంవత్సరాలుగా దెబ్బతిని తీవ్రంగా పా డైపోయిందని, వెంటనే మరమ్మతులు చేపట్టా లని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జగదాంబ జోన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహిం చారు.ఈ సందర్భంగా జగదాంబ జోన్ నాయ కులు ఎం. సుబ్బారావు మాట్లాడుతూ, పంజా జంక్షన్ నుంచి బీచ్‌కు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బ తిని ప్రయాణానికి తీవ్ర అంతరాయం కలిగిస్తోం దన్నారు. ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు నడపడం మాత్రమే కాకుండా, ప్రజలు నడిచేం దుకు కూడా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డా యని తెలిపారు. ముఖ్యంగా రోగులు, గర్భిణీ స్త్రీలు ఆసుపత్రులకు వెళ్లే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

సుమారు రెండు నెలల క్రితం స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఈ రోడ్డుకు శంకు స్థాపన చేసినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రా రంభం కాకపోవడం బాధాకరమన్నారు. ప్రభు త్వం అభివృద్ధి గురించి మాటలు చెబుతున్న ప్పటికీ, పనులు మాత్రం ముందుకు సాగడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబా బు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాటలకే పరిమితమైపోయారని, పరిపాలనలో మార్పు కనిపించడం లేదని యద్దేవా చేశారు.ఇప్పటికైనా జివిఎంసి కమిషనర్ స్పందించి పంజా జంక్షన్ బీచ్ రోడ్డును వెంటనే బాగు చేయాలని డిమాం డ్ చేశారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జగ దాంబ జోన్ ఉపాధ్యక్షుడు ఎం. సుబ్బారావు హెచ్చరించారు.

ఈ ధర్నాలో ప్రజలు, ప్రసాద్, శ్రీను తదితర సీఐ టీయూ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎం ఎస్ ఎం / టీజీ కమ్యూనిటీ కోసం మెగా వైద్య శిబిరం నిర్వహణ

**65 మందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు మందుల పంపిణీ**




**విశాఖ మార్చ్ 14(పెన్ పవర్)**వై ఆర్ జి కేర్ ఆధ్వర్యంలో ఎం ఎస్ ఎం / టీజీ కమ్యూనిటీ సభ్యుల కోసం మెడికవర్ సహకారంతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వై ఆర్ జి కేర్ సైట్ కోఆర్డినేటర్ ఎస్ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

ఈ వైద్య శిబిరంలో రక్తపోటు, మధుమేహం, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. మెడికవర్ నుండి వచ్చిన డాక్టర్ రోషిని శిబిరానికి వచ్చిన వారికి ఆరోగ్య పరీక్షలు చేసి తగిన సలహాలు మరియు సూచనలు అందించారు. ఈ శిబిరంలో దాదాపు అరవై ఐదుగురు కమ్యూనిటీ సభ్యులకు వైద్య సేవలు అందించబడ్డాయి.

ఈ సందర్భంగా డాక్టర్ రోషిని మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఆరోగ్య సేవలందించేందుకు మెడికవర్ సంస్థ తరపున మరింత సహకారం అందిస్తామని తెలిపారు. ఇలాంటి వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు వై ఆర్ జి కేర్ సైట్ కోఆర్డినేటర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

సైట్ కోఆర్డినేటర్ ఎస్ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ వై ఆర్ జి కేర్ సంస్థను డాక్టర్ సునీతి సోలమన్ వెయ్యి తొంభై ఆరు సంవత్సరంలో స్థాపించారని తెలిపారు. అధిక ప్రమాదంలో ఉన్న వారికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించి వారిని రక్షించాలనే లక్ష్యంతో ఈ సంస్థను ప్రారంభించారని చెప్పారు. ప్రస్తుతం ఈ సంస్థను దేశవ్యాప్తంగా విస్తరించేలా ప్రధాన కార్యనిర్వాహక అధికారి ఏ కే శ్రీకృష్ణన్ కృషి చేస్తున్నారని తెలిపారు.

ఈ క్రమంలోనే రెండు వేల పద్నాలుగు సంవత్సరంలో విశాఖపట్నంలో ఎం ఎస్ ఎం / టీజీ కమ్యూనిటీ సభ్యుల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడం, వారికి వివక్ష లేకుండా ఆరోగ్య సేవలు అందించడం కోసం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కేంద్రం ద్వారా హెచ్ఐవి పరీక్షలు, హెచ్ఐవి మరియు లైంగిక వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, అవసరమైన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. సమస్యలు ఎదుర్కొనే వారికి ప్రభుత్వ వైద్య సదుపాయాలు అందేలా మార్గనిర్దేశం చేసి సంబంధిత ఆసుపత్రులకు పంపించడం జరుగుతుందని తెలిపారు.

అలాగే వారి మానసిక స్థితి మెరుగుపడేలా కౌన్సిలింగ్ అందిస్తున్నామని తెలిపారు. ట్రాన్స్ జెండర్ సభ్యులకు గుర్తింపు ధ్రువపత్రాలు అందేలా సౌకర్యం కల్పించామని చెప్పారు. ఫీల్డ్ కోఆర్డినేటర్ ఎస్ అరుణ్ కేజీహెచ్ వైద్యులతో మరియు డిఆర్డిఏ శాఖతో సమన్వయం చేసి వందకు పైగా ట్రాన్స్ జెండర్ ధ్రువపత్రాలు పొందేలా సహకరించారని తెలిపారు. ప్రస్తుతం వారిలో చాలామంది పెన్షన్ పొందుతూ జీవనోపాధి కోసం వ్యాపారాలు కూడా ప్రారంభించారని చెప్పారు. కొందరికి గృహాల మంజూరు కూడా జరిగిందని తెలిపారు.

ప్రతి ఎం ఎస్ ఎం / టీజీ కమ్యూనిటీ సభ్యుడు సమాజంలో గౌరవంగా జీవిస్తూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని వై ఆర్ జి కేర్ లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని తెలిపారు. ఈ లక్ష్యంతోనే ఈరోజు నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతంగా పూర్తయిందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మెడికవర్ వైద్యురాలు రోషిని, వైద్య శిబిరం నిర్వాహకుడు డి శ్రీనివాసరావు, ఆసుపత్రి సిబ్బంది, వై ఆర్ జి కేర్ సైట్ కోఆర్డినేటర్ ఎస్ సుబ్బలక్ష్మి, ఫీల్డ్ సిబ్బంది ఎస్ అరుణ్, టెక్నీషియన్ వి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## 16 నుంచి 25 వరకు గ్రామాల్లో ‘రైతన్న మీ కోసం’ కార్యక్రమం

మండల వ్యవసాయ శాఖ అధికారి డి గిరిబాబు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి 14:**రైతుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు ‘రైతన్న మీ కోసం’ కార్యక్రమాన్ని ఈ నెల 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి తెలిపారు. గూడెం కొత్త వీధి మండల పరిధిలోని ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో గల గ్రామాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల అధికారులు పాల్గొని రైతుల సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాలు సూచించనున్నారు. రైతులకు అందుబాటులో ఉన్న పథకాలు, సాగు విధానాలు, సాంకేతిక సూచనలు ఈ కార్యక్రమంలో వివరించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి గిరిబాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, పీఏసీఎస్ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పీసా కమిటీ అధ్యక్షులు, సభ్యులు, మండల మరియు జిల్లా స్థాయి కూటమి నాయకులు, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు. ఇదిలా ఉండగా, గూడెం కొత్తవీధి మండలానికి చెందిన 9,902 మంది రైతులకు ‘అన్నదాత సుఖీభవ’ పథకం కింద రూ.3.96 కోట్లు, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రూ.1.98 కోట్లు జమ చేసినట్లు తెలిపారు.మొత్తం రూ.5.94 కోట్లు రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు పేర్కొన్నారు.రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు.

## గిరిజనులకు 100% ఉద్యోగాలు కల్పించాలి





**ఏఎస్ఆర్ జిల్లాను జోన్1లోనే కొనసాగించాలి**

**మాటమంతి కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రికి వినతి పత్రం**

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,మార్చి 14:**గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగ నియామకాల విషయంలో ప్రత్యేక చట్టం తీసుకువచ్చి 100 శాతం ఆదివాసీలకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కోరారు.అల్లూరి సీతారామ రాజు జిల్లా పరిధిలోని నంది గురువు లో నిర్వహించిన ‘మాట–మంతి’ కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రిని గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మసాడా ఈశ్వరరావు కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం అమలులో ఉన్న జి.ఓ.ఎంఎస్ నం.3 స్థానంలో షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాలపై ప్రత్యేక చట్టం తీసుకువచ్చి స్థానిక ఆదివాసీలకు పూర్తిస్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్–1లోనే కొనసాగించాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధి, స్థానికులకు ఉపాధి అవకాశాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం కోశాధికారి వలసనైనీ కొండలరావు, సభ్యుడు తమర్బ తౌడం నాయుడు,యువి గిరి తదితరులు పాల్గొన్నారు.

## కె.టి.బి. కళాకేత్రం వెల్ఫేర్ అసోసియేషన్ 3వ వార్షికోత్సవం

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు**



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, మార్చి 14 :** స్థానికవిశాఖ పశ్చిమ, 90వ వార్డు, కాకానినగర్‌లోని కె.టి.బి. కళాకేత్రం వెల్ఫేర్ అసోసియేషన్ 3వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ మరియు విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ రక్తదానం మహాదానం అని, ఒక వ్యక్తి ఇచ్చే రక్తం ద్వారా మరొకరి ప్రాణాలు కాపాడబడతాయని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకుని, స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. యువత ముఖ్యంగా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు.

కె.టి.బి. కళాకేత్రం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన ప్రశంసించారు. సంఘం 3వ వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో స్థానిక యువకులు, స్వచ్ఛంద సేవకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. నిర్వాహకులు రక్తదాతలకు ధన్యవాదాలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

